


# కరపత్రం

SINCE 2014

ఆదివారం ఆగస్ట్ 02, 2026 | సంపుటి : 2 | సంచిక : 291 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## కొత్త శిఖరాలకు తెలంగాణ ఆర్థికాభివృద్ధి

# తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక

♦ సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఆగస్ట్1 :** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.



# తెలంగాణ రైజింగ్ -2047'లో భాగస్వామ్యం అవ్వండి

**ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి**

♦ సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు

♦ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,ఆగస్ట్1 :** కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'తెలంగాణ రైజింగ్-2047' అనేది కేవలం



ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. మిగతాద్ది 2 లో




## స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

- సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే
- చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య
- దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత

2 లో



## చెరువుల పునరుద్దరణతో మారుతున్న రూపురేఖలు

- నల్ల చెరువు పునరుద్దరణపై సిఎం రేవంత్ హర్షం

**హైదరాబాద్,ఆగస్ట్1 :** చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న మన హైదరాబాద్‌ను చూడటం ఎంతో సంతృప్తినిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



2 లో

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

» సోషల్ మీడియాతోనే నిజాలు వెలుగులోకి.
» యువత రీల్స్‌లోనే వార్తలు చూస్తోంది.
» జెన్-జీ ఓటర్లే ఎన్నికల గేమ్ ఛేంజర్స్.
» ప్రధాన మీడియాపై కేటీఆర్ విమర్శలు.
» పరిశోధనాత్మక జర్నలిజం ఎక్కడ? అని ప్రశ్న.
» నిర్భయంగా వార్తలు రాసే పరిస్థితి లేదన్నారు.
» నవతెలంగాణ సెమినార్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు.

**హైదరాబాద్,ఆగస్ట్1 :** యువతరం కొత్త తరహాలో దిల్లీలో కదం తొక్కిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా

» తల్లిపాల శ్రేష్ఠతను గుర్తించాలి
» ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
» అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



**హైదరాబాద్,ఆగస్ట్1 :** పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలి.. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. మిగతాద్ది 2 లో

# రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ


- హేట్ స్పీచ్ బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ.
- వర్షాకాల సమావేశాల్లో నివేదిక లక్ష్యం.
- విద్వేష ప్రసంగాలపై చట్టం: పొన్నం.
- వారం రోజుల్లో మరో కమిటీ భేటీ.
- అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటాం.
- భావప్రకటన స్వేచ్ఛకు భంగం ఉండదు.
- వ్యక్తుల గౌరవం కాపాడేలా నివేదిక.




మిగతాది 2లో

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

» అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
» పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
» నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు
» భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల
» త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
» కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం
» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2లో

**హైదరాబాద్,ఆగస్ట్1 :** ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు.

# ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

- తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు
- దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్
- మంత్రి దుద్ధిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఆగస్ట్1 :** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆ÷-లనైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మిగతాద్ది 2 లో

# కాపాడాల్సిన పోలీసే కాటేశాడు..!



**వరంగల్ క్రైం:** సోషల్ మీడియా ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ కటకటలపాలయ్యాడు. ఈమేరకు శుక్రవారం సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందిన కదిరే శ్రీకాంత్ 2014 బ్యాచ్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్. సోషల్ మీడియా వేదికగా మహిళలతో పరిచయం పెంచుకుంటూ.. వారిని మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు.

# స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

మొదటిపేజీ తరువాయి
ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్టాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అఅయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లోద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి
సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ౯÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## గ్రీన్ కారిడార్‌గా ఉపయోగపడ్డ మెట్రో అవయవ మార్పిడి కోసం అవయవాల తరలింపు

హైదరాబాద్ మెట్రో రైలు కేవలం నగరవాసులను గమ్యస్థానాలకు చేర్చే రవాణా వ్యవస్థగానే కాకుండా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సంజీవనిలా మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. తీవ్రమైన ట్రాఫిక్ చిక్కులను అధిగమించి, అవయవ మార్పిడి చికిత్స కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను సురక్షితంగా , వేగంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక 'గ్రీన్ కారిడార్'గా మారింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె , ఊపిరితిత్తులను సికింద్రాబాద్ పరిధిలోని కిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది. రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ సమస్యల వల్ల సమయం వృధా అయ్యే ప్రమాదం ఉండటంతో వైద్యులు మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన హైదరాబాద్ మెట్రో అధికారులు రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేకంగా మెట్రో ట్రాన్సిట్‌ను ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో ఉన్న 13 స్టేషన్లను దాటుకుంటూ, కేవలం 25 నిమిషాల్లోనే 14 కిలోమీటర్ల దూరాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి అవయవాలను సురక్షితంగా చేర్చారు. అవయవ మార్పిడి చికిత్సల్లో ప్రతి నిమిషం ఎంతో విలువైనది. ఈ విషయాన్ని గుర్తించిన వైద్య బృందాలు , మెట్రో సిబ్బంది పరస్పరం పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఈ మిషన్‌ను విజయవంతం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో అత్యవసర అవయవాల రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సరైన సమయానికి డోనర్ అవయవాలు కిమ్స్ ఆసుపత్రికి చేరడంతో బాధితుడికి అవయవ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది.
అత్యవసర వైద్య సేవలకు నిరంతరం అండగా నిలుస్తున్న హైదరాబాద్ మెట్రో సేవలకు నగరవాసుల నుంచి, వైద్య వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నిమిషాల విలువను గుర్తించి, కచ్చితమైన ప్రణాళికతో సమయానికి అవయవాలను చేర్చి ఒక ప్రాణాన్ని నిలబెట్టడంలో మెట్రో పోషించిన పాత్ర ప్రశంసనీయం. వేగవంతమైన ప్రయాణానికే కాదు, మానవతా దృక్పథంతో ప్రాణాలు కాపాడటంలోనూ తాను ఎప్పుడూ ముందే ఉంటానని హైదరాబాద్ మెట్రో మరోసారి నిరూపించింది.

## లోకేశ్‌కు ప్రధాని అభినందనలు బాగా పనిచేస్తున్నావంటూ కితాబు

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ.. ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధానికి వీడ్కోలు పలికేందుకు వచ్చిన లోకేశ్ భుజం తట్టి.. 'నువ్వు చాలా బాగా పనిచేస్తున్నావు.. శభాష్ లోకేశ్' అని ప్రశంసించారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంపై కూడా ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు. నారా లోకేశ్ పనితీరును ప్రధాని మోదీ మెచ్చుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాని పాల్గొన్న పలు ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించిన సందర్భాల్లోనూ మోదీ ఇదే తరహాలో ఆయనను అభినందించారు. ముఖ్యంగా 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా ప్రపంచ రికార్డు స్థాయిలో యోగా నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. తాజాగా భోగాపురం పర్యటన సందర్భంగా మరోసారి లోకేశ్‌ను ఆప్యాయంగా అభినందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రధాని సూచించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## చెరువుల పునరుద్ధరణతో మారుతున్న రూపురేఖలు

మొదటిపేజీ తరువాయి
నగరంలోని చెరువులకు జీవం పోస్తూ, భావి తరాలకు మెరుగైన భవిష్యత్తును అంకితం చేస్తున్న హైడ్రా పనితీరును ఆయన అభినందించారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, అది భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చెరువును కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం చెప్పారు. నగరంలోని జలవనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

## కాపాడాల్సిన పోలీసే కాటేశాడు..!

మొదటిపేజీ తరువాయి
2025లో ఫేస్ బుక్ ద్వారా శ్రీకాంత్ ఓ మహిళతో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ఆమెతో సన్నిహిత సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. అతడు జమ్మికుంటలో పనిచేస్తుండగా ఆమె వ్యక్తిగత పరిస్థితులను ఆసరాగా చేసుకుని బలవంతంగా లొంగదీసుకున్నాడు. అనంతరం బాధితురాలి వ్యక్తిగత ఫొటోలతో బెదిరించడం, వీడియో కాల్స్ ద్వారా అసభ్యకరంగా వేధించి, డబ్బులు వసూలు చేశాడు. ఇచ్చిన డబ్బులు అడిగితే బెదిరించాడు. ఈమేరకు బాధితురాలు హనుమకొండలోని సుబేదారి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీస్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణ కొనసాగుతుండగా.. నాలుగు నెలల నుంచి నిందితుడు అరెస్ట్‌కు భయపడి గోవా, హైదరాబాద్, నిజామాబాద్ పలు ప్రాంతాల్లో తలదాచుకుంటూ తిరిగినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ వెల్లడించారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు చివరికి సిమ్‌కార్డులు కూడా ధ్వంసం చేసి వై--ఫై ద్వారా కమ్యూనికేషన్ కొనసాగించాడు. సాంకేతిక ృఆధారాలు, విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా, హనుమకొండ మూడో అదనపు కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు తరలిస్తున్న ట్లు ఉత్తర్వులు జారీ చేశారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

మొదటిపేజీ తరువాయి
అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబోతున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అన్నారు.
తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు
వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

## తల్లి పాలే శిశువుకు తొలి టీకా

మొదటిపేజీ తరువాయి
తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

## తెలంగాణ రైజింగ్ -2047'లో భాగస్వామ్యం అవ్వండి

మొదటిపేజీ తరువాయి
సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు... కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్( సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ' ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పోరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

మొదటిపేజీ తరువాయి
మీసేవ డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆ÷-లనైన్ ఎ÷-లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు.
÷-రతీ రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు
సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ లో వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమం



కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

మేడ్చల్ సర్కిల్ పరిధిలో "వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమం శనివారం జరిగింది. సీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అధికారులు ప్రజలతో సమావేశమై రోడ్ల మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం, పార్కులు, స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి, వీధి దీపాలు, వ్యర్థాల తొలగింపు, దోమల నియంత్రణ, తాగునీటి సరఫరా, యూజీడీ లైన్లు, చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా చర్యలు, ఎల్ఆర్ఎస్ సమస్యలు వంటి అనేక వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# తమలపాకుతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు!

గజెల్లి రాజేంద్ర ప్రసాద్,సోషల్ అనలిస్ట్



తమలపాకులో విటమిన్ సి, కాల్షియం, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. తమలపాకు శ్వాసకోశ సమస్యలు, నొప్పులు, జీర్ణక్రియ, నోటి ఆరోగ్యం, చిన్న గాయాలు, బరువు నియంత్రణ, డిటాక్సిఫికేషన్‌కు సహాయపడుతుంది.దగ్గు, జలుబుకు తమలపాకు, అల్లం, లవంగాలతో చేసిన కషాయం మంచిది.కీళ్ల నొప్పులకు తమలపాకు పేస్ట్ ఉపశమనం కలిగిస్తుంది.భోజనం తర్వాత తమలపాకు నమలడం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.అయితే, పొగాకు, సున్నంతో కలిపి వాడటం హానికరం. అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలి.

# మాతృశ్రీ హైస్కూల్‌లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు




గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

మెట్‌పల్లిలోని మాతృశ్రీ హైస్కూల్‌లో శనివారం ముందస్తు స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, స్వీట్లు పంచుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో స్నేహానికి ఉన్న విలువను, నిజమైన స్నేహితుల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో స్కూల్ ఆవరణ పండుగ వాతావరణాన్ని తలపించింది.

# మెట్‌పల్లి లో తల్లిపాల వారోత్సవాలు



గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

మెట్‌పల్లి పట్టణంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. మెట్‌పల్లి పట్టణం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మిషన్ హాస్పిటల్ లో గర్భిణీలకు, తల్లులకు సిడిపిఓ పద్మ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, ఇతర పదార్థాలు పెట్టకూడదని సూచించారు. తల్లి, పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డా ఏఫ్సిబా, సూపర్వైజర్ ప్రతిభ, అంగన్వాడీ టీచర్స్ పద్మ, లక్ష్మి, నజీమా, వనజ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# అర్బన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా జిల్లెల రవీందర్ నియామకం

కరపత్రం ప్రతినిధి ఉప్పల్, ఆగస్టు 01

భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్ సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి ని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గా నియామకం ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ బాధ్యతలను నా పై నమ్మకం ఉంచి అప్పగించిన పూర్వ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పైడిమడుగులో మహిళా గ్రామసభ,బాలసభ బి.ఎల్.ఓ లకు సన్మానం

గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

కోరుట్ల మండలం, పైడిమడుగు గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహిళా గ్రామసభ, బాలసభ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల సాధికారత, గ్రామ పరిశుభ్రత, స్వయం ఉపాధి, కుటీర పరిశ్రమల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. బాలసభలో విద్యార్థులకు విద్య, క్రమశిక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ బడుగు భూమేశ్వర్, ఉపసర్పంచ్ గాంధారి సుజాత, గ్రామపంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్థులు హాజరయ్యారు.





■ బి.ఎల్.ఓ లకు సన్మానం

పైడిమడుగులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ ఆఫీసర్లను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి బీఎల్ఓల సేవలు అమూల్యమని సర్పంచ్ బడుగు భూమేశ్వర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఉపసర్పంచ్, కార్యవర్గ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఐకేపీ, వీవోఏస్ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ పేరుతో సర్టిఫికెట్లు నిలిపివేయొద్దు

- హైకోర్టు తీర్పు విద్యార్థుల హక్కులకు రక్షణ కవచం
- ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని ప్రైవేటు కళాశాలలకు ఆదేశాలు
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 1

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, వాటిని వెంటనే విద్యార్థులకు అందజేయాలని హైకోర్టు ప్రైవేటు కళాశాలలకు ఆదేశించడం హర్షణీయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెంకట్రాములు మాట్లాడుతూ.. హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల పేరుతో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిరాకరించడంతో, ఆ విద్యార్థి హైకోర్టును ఆశ్రయించాడన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం కళాశాల యాజమాన్యాన్ని



తీవ్రంగా మందలిస్తూ, ఒరిజినల్ సర్టిఫికెట్లపై పూర్తి హక్కు విద్యార్థికే ఉంటుందని, వాటిని ఫీజుల కోసం తనఖా పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేయడం విద్యార్థుల హక్కులను కాపాడే కీలక నిర్ణయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేటు విద్యాసంస్థలు కోర్సులు పూర్తయిన తర్వాత కూడా సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు కళాశాలలు తక్షణమే అమలు చేసి, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో సంబంధం లేకుండా ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న పలు బకాయిలను చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థులకు సంబంధించిన వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను మాత్రం ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటు విద్యాసంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

- ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా జడ్జి డా. టి. శ్రీనివాసరావు

కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 1

వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా వంటి అమానవీయ దురాచారాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు జిల్లా జడ్జి డా. టి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ సుబేదారిలోని అచ్చుతా భవన్‌లో పోలీసు, రెవెన్యూ, కార్మిక శాఖల అధికారులకు వెట్టి చాకిరి నిర్మూలన, మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి డా. టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరుల శ్రమను దోచుకోవడం, వెట్టి చాకిరికి గురిచేయడం వంటి చర్యలు సమాజానికి మచ్చగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తనకోసం మాత్రమే కాకుండా ఇతరుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని




జీవించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని, ఇందుకోసం ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని సూచించారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రామలింగయ్య మాట్లాడుతూ, బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ కట్టుబడి ఉందన్నారు. కార్మికులు, చిన్నారులను వెట్టి చాకిరికి గురిచేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ, కార్మిక శాఖలు, స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ డివిజన్ హెడ్ డా. ఆనంద్, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుభాషిని, సుబేదారి ఎస్ఐ కృష్ణవేణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు షర్ఫుద్దీన్, వినోద్ రాజకుమారి, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రతినిధులు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ఇక్బాల్ పాషా, అజయ్ కుమార్, కె. రవికుమార్, రాకేష్, ప్రసాద్, ప్రదీప్, నరసింహస్వామి తదితరులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైకోర్టు అడ్వకేట్ రవికృష్ణ వెట్టి చాకిరి నిర్మూలన చట్టాలు, బాధితుల హక్కులు, మానవ అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సవివరంగా అవగాహన కల్పించారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణలో సూపర్వైజర్ల పాత్ర కీలకం

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా ఉండాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య

కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 1

సీజనల్ వ్యాధుల నియంత్రణతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో హెల్త్ సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ. అప్పయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పీహెచ్‌సీల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారులు, పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరును సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో




పాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. ఇంటింటి సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని అన్నారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పూర్తి చేయాలని, బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించి గర్భాశయ క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ నియంత్రణలో హెల్త్ అసిస్టెంట్లు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్ రావు మాట్లాడుతూ, జిల్లాలో 2025, 2026లో ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని, 2025లో 191 డెంగ్యూ కేసులు నమోదుకాగా, 2026లో ఇప్పటివరకు కేవలం 21 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రజిత గర్భిణులను తొలి మూడు నెలల్లోనే 100 శాతం నమోదు చేసి, హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక సేవలు అందించాలని సూచించారు. డాక్టర్ ఎ. శ్రీకృష్ణరావు ఇమ్యునైజేషన్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.
సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోల రాజేష్, డెమో అశోక్ రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మితో పాటు జిల్లాలోని పీహెచ్‌సీల ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్-2026 ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోంది..

- కలెక్టర్ డా.సత్య శారద

కరపత్రం ప్రతినిధి వరంగల్ ఆగస్టు,1

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్-2026)ను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్



డా.సత్య శారద తెలిపారు.శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్-2026 పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని,అనర్హుల వివరాలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు,అభ్యంతరాలను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సమర్పించాలని కోరారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమన్వయంతో,పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)జి.సంధ్యారాణి,అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) వై.వి.గణేష్, డీఆర్‌వో విజయలక్ష్మి, వరంగల్,నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి,సంబంధిత మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హరీశంకర్(బీజేపీ),నాగవెల్లి రజినీకాంత్ (వైఎస్సార్‌సీపీ),కుసుమ శ్యామ్(టీడీపీ),ఫయాజ్(ఎంఐఎం),రాజేష్(కాంగ్రెస్),సుల్తాన్(బీఎస్పీ)తదితరులు హాజరయ్యారు.

# అవయవదానం - మహాదానం”...

## ఒక దాతతో ఎనిమిది ప్రాణాలకు పునర్జన్మ







- ఎస్ఆర్ఆర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవయవదానంపై చైతన్య సదస్సు
- యువత సేవాభావంతో ముందుకు రావాలి
- ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ దేవరశెట్టి రజిత
- ఫార్మసీ విద్యార్థులు సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలి
- ప్రొఫెసర్ బి. అగయ్య గౌడ్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 1**

ఒక వ్యక్తి మరణానంతరం కూడా పలువురికి కొత్త జీవితాన్ని ప్రసాదించగల అత్యున్నత మానవతా సేవ అవయవదానం అని, సమాజంలో ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంపొందించుకొని స్వచ్ఛందంగా ముందుకు రావాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ దేవరశెట్టి రజిత పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్లాతుర్తి మండలం వల్భాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో “అవయవదానం - మహాదానం” అనే అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్, చైర్మన్ ప్రొఫెసర్ బి. అగయ్య గౌడ్ మార్గదర్శకత్వంలో జరిగింది. దేవరశెట్టి రజిత మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్తో పాటు అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం తరపున రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తాను నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. అవయవ దానం పట్ల సమాజంలో ఇంకా అనేక అపోహలు కొనసాగు తున్నాయని, వాటిని తొలగించి శాస్త్రీయ దృక్పథంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అవయవ దానం ద్వారా ఒక దాత ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడగలరని, నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని ఆమె వివరించారు. బ్రెయిన్ డెత్ (మెదడు మరణం) అనంతరం కూడా చట్టబద్ధంగా అవయవ దానం చేయవచ్చని, ఇది పూర్తిగా స్వచ్ఛంద మానవతా సేవ అని తెలిపారు. కుటుంబ సభ్యుల్లో అవగాహన పెంపొందించి వారి సమ్మతితో అవయవ దానం జరిగేలా చూడాలని సూచించారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మానవత్వాన్ని చాటే ఈ గొప్ప సేవను ప్రతి ఒక్కరూ జీవిత లక్ష్యంగా తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, చైర్మన్ ప్రొఫెసర్ బి. అగయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులు కేవలం ఔషధ విజ్ఞానానికే పరిమితం కాకుండా సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే బాధ్యతను కూడా నిర్వర్తించాలని సూచించారు. భవిష్యత్తు లో ఆరోగ్య రంగంలో సేవలందించే విద్యార్థులు మానవతా విలువలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక బాధ్యతను పెంపొందించే ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కళాశాల తరచూ నిర్వహిస్తోందని తెలిపారు.

సదస్సులో అవయవదానం అవసరం, చట్టపరమైన అంశాలు, సమాజంలో ఉన్న అపోహలు, దాతల అనుభవాలు, అవయవ మార్పిడి ద్వారా ప్రాణాలు నిలబెట్టుకున్న వారి ఉదాహరణలను వివరించి విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. అనంతరం విద్యార్థులు అవయవదానంపై అవగాహన ప్రతిజ్ఞ చేసి, భవిష్యత్తులో ఈ సందేశాన్ని సమాజంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ దిలీప్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ స్వాతి తదితరులు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథి దేవరశెట్టి రజితను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

# కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు ఎంపికైన వరంగల్ కళాకారులకు అభినందనలు

- చేనేత రంగానికి ఇది గర్వకారణం - చిప్ప వెంకటేశ్వర్లు

**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 1**



జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు వరంగల్ నగరానికి చెందిన ఇద్దరు చేనేత కళాకారులు ఎంపిక కావడం ఆనందదాయకమని టీ-పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది అవార్డులకు కొత్తవాడకు చెందిన గోరంటల (పిట్ట) రాజు (తండ్రి: శంకరయ్య), కరీమాబాద్‌కు చెందిన కంచె సమత (తండ్రి: నర్సింగరావు) ఎంపిక కావడం వరంగల్ చేనేత రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇద్దరు కళాకారులు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన చేనేత వృత్తిని కొనసాగిస్తూ, ఆధునిక డిజైన్లు, ఆకర్షణీయమైన రంగుల కలయికతో వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా నూతన వస్త్రాలను రూపొందించి రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీ ప్రశంసలు పొందారని తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి నలుగురు దరఖాస్తు చేయగా, వీరిద్దరినే అవార్డులకు ఎంపిక చేయడం వారి ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ప్రతి అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు రూ.25 వేల నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 7న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకోనున్నారని చెప్పారు. అవార్డుల ఎంపిక ప్రక్రియలో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి, ఉప సహాయ సంచాలకులు సుధీర్ అందించిన సహకారం అభినందనీయమని చిప్ప వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన ఇద్దరు చేనేత కళాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపులు సాధించాలని ఆకాంక్షించారు.

# ఐదో వార్డులో విస్తృతంగా మొక్కల పంపిణీ

- ప్రతి ఇంటికి ఒక మొక్క.. పచ్చదనమే లక్ష్యంగా ముందుకు: కౌన్సిలర్ సొల్లు సునీత

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్, ఆగస్టు 1**



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను పెంచి హరితహారాన్ని విజయవంతం చేయాలని హుజూరాబాద్ మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత పిలుపునిచ్చారు.

శనివారం హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని వడ్డెర కాలనీ, రజకవాడ, గౌడ సంఘం కాలనీ, మాల సంఘం కాలనీ తదితర ప్రాంతాల్లో ఆమె ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటి, ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సొల్లు బాబు, హనుమాన్ గుడి చైర్మన్ కొలిపాక శంకర్, కొండపాక భూపాల్, గాదం భాగ్యలక్ష్మి, వడ్డెర కాలనీ వాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత భూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం

- శామీర్‌పేట నివాసంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి సమస్యలు వివరించిన అన్మత్‌నగర్, హయత్‌నగర్ భూ బాధితులు

**కరపత్రం ప్రతినిధి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, ఆగస్టు 1**



దశాబ్దాలుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూముల్లో ఇళ్లు నిర్మించుకునే హక్కు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అన్మత్‌నగర్, హయత్‌నగర్‌కు చెందిన భూ బాధితులు శనివారం శామీర్‌పేటలోని ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, సుమారు 50 సంవత్సరాల క్రితం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేద దళిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున భూమి కేటాయించారని తెలిపారు. అయితే ప్రస్తుతం అదే భూమిలో చిన్న ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తే అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించుకోవడానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకపోయిందని, న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆశ్రయించామని చెప్పారు. తాము ఇళ్లలో పనులు చేసుకుంటూ, చెత్త సేకరణ వంటి కూలి పనులతో జీవనం సాగించే నిరుపేద కుటుంబాలని, నివాసం కోసం కనీసం 100 గజాల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

“మా కుటుంబ సభ్యులు మరణించినా ఇంటి ముందు ఉంచుకునేంత స్థలం కూడా లేదు. తలదాచుకునేందుకు సొంత ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించండి” అంటూ బాధితులు భావోద్వేగానికి గురయ్యారు.

బాధితుల సమస్యలను ఓర్పుగా విన్న ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ, దళిత కుటుంబాలకు అన్యాయం జరగకుండా సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భూ బాధితులు తమ సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# 6న ‘సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ’

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు
- సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయండి: టిఆర్ఎస్ నాయకుల పిలుపు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 1**



సామాజిక న్యాయ తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ‘సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ’ ను ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ప్రకటించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సంకల్ప సభ పోస్టర్‌ను పార్టీ సీనియర్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు ఎల్. రూప్ సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సామాజిక వర్గానికి సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధనకు ప్రభుత్వంపై ప్రజా స్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకురావడమే ఈ సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభ ద్వారా సామాజిక న్యాయంపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చకు నాంది పలకనున్నట్లు తెలిపారు. సామాజిక తెలంగాణే ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆకాంక్ష అని, ఆయన ఆశయాల సాధనకు ఈ సంకల్ప సభ వేదిక కానుందని అన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ వర్గాల్లోని అనేక కులాలకు ఇప్పటికీ కనీస రాజకీయ అవకాశాలు కూడా అందడం లేదని రూప్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి ఉన్నత పదవుల వరకు అన్ని సామాజిక వర్గాలకు సమాన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నవీన్ ఆచారి, నరేశ్ ప్రజాపతి, కోల శ్రీనివాస్, చిలుక ప్రవీణ్, సుహైబ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 1**



మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం జఫర్‌గడ్, ధర్మసాగర్ మండలాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ముందుగా జఫర్‌గడ్ మండల కేంద్రంలోని వడ్డెగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మామిడాల ప్రభాకర్ మృతికి నివాళులర్పించారు. అనంతరం తిడుగు గ్రామ సర్పంచ్ గోపు సోమయ్య తండ్రి గోపు మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తదుపరి ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన కావటి రాజయ్య, కోడూరు రంగారెడ్డి చిత్రపటాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన పుట్ట ప్రమీల మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్--XII విజయవంతం

- 314 మంది చిన్నారులకు విముక్తి కల్పించిన వరంగల్ పోలీసులు
- బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 55 కేసులు నమోదు

**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 1**




కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 1 నుంచి 31 వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్--XII ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను రక్షించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపీఎస్ తెలిపారు.రక్షించబడిన వారిలో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారని వెల్లడించారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా పారిశ్రామిక ప్రాంతాలు,షాపులు,ఇటుక బట్టీలు,ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఇందుకోసం కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది సబ్‌డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,తొమ్మిది మంది ఎస్ఐలు,36 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్,బాలల పరిరక్షణ విభాగం,చైల్డ్ హెల్ప్‌లైన్,కార్మిక శాఖ అధికారులు,షేర్,స్కోప్,ఎఫ్ఎంఎం--ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు.ఈ ఆపరేషన్‌లో 226 మంది బాల కార్మికులను,85 మంది బడి మానేసిన(డ్రాప్‌అవుట్) చిన్నారులను గుర్తించి రక్షించారు.అనంతరం వారిని వరంగల్,హనుమకొండ,జనగాం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరుపరచి,పిల్లలు మరియు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించినట్లు తెలిపారు.రక్షించబడిన చిన్నారుల్లో బీహార్,మహారాష్ట్ర,కర్ణాటక,రాజస్థాన్,ఆంధ్రప్రదేశ్,పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు.నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పని చేయించిన యజమానులపై కమిషనరేట్ పరిధిలో 55 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.అలాగే కార్మిక శాఖ ద్వారా 92 ఇన్‌స్పెక్షన్ రిపోర్టులు నమోదు చేయించగా,వివిధ పోలీస్ స్టేషన్ల జనరల్ డైరీల్లో 118 మంది చిన్నారుల వివరాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ,”పిల్లలు బడిలో ఉండాలి.. పనిలో కాదు.బాల్యాన్ని కాపాడటమే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యం.బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు”అని హెచ్చరించారు.చిన్నారుల హక్కుల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని,ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు మహిళా,శిశు సంక్షేమ శాఖ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,కార్మిక శాఖ,విద్యాశాఖ అధికారులు,చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది,షేర్,స్కోప్,ఎఫ్ఎంఎం--ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేషనల్ ఫెడరేషన్ జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ద్వైవార్షిక సమావేశాలు ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 1**




నేషనల్ ఫెడరేషన్ జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ (ఎన్ఎఫ్‌జీఐఈ) 21వ ద్వైవార్షిక సర్వసభ్య మండలి సమావేశాలు శనివారం హైదరాబాద్ నాగోల్‌లోని ఎస్‌వీఎం గ్రాండ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. భారతీయ మజ్దూర్ సంఘ్ ఇన్సూరెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సోమేష్ బిశ్వాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఎంఎస్ అధ్యక్షుడు మల్లేశం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు సాధారణ బీమా పరిశ్రమ అభివృద్ధి, ఉద్యోగుల పాత్ర, పని సంస్కృతి, సంస్థల పనితీరు మెరుగుదల, వేతన సవరణలు వంటి అంశాలపై చర్చించారు. ప్రైవేట్ బీమా సంస్థల పోటీని సమర్థంగా ఎదుర్కొనేందుకు పాలసీదారులకు నాణ్యమైన సేవలు అందించడం అత్యంత అవసరమని సమావేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌జీఐఈ అధ్యక్షుడు పి.ఎస్. బాజ్‌పాయ్, ప్రధాన కార్యదర్శి విజయ్ ఆప్టే, వి. రాజా, రాజా గౌడ్, రాజేష్ సావంత్, కృష్ణకాంత్ నల్గే తదితరులు పాల్గొన్నారు. సమావేశాలు ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నికతో ముగియనున్నాయి.